# మహర్షి

జీవితమంతా పరుగు...పరుగు...పరుగు.

బడిలో, కాలేజీలో...చదువు...ఒకటే చదువు. చదువై పోగానే ఉద్యోగం...ఉద్యోగంలో నానా రోతపనులు...మస్కాలు, లంచాలు, కాకాలు, పైరవీలు.

ఇటు భార్య...పిల్లలు. అటు రోగాలు ... రొచ్చులు .... వాళ్ళ చదువులు, బట్టలు, ఫీజులు. నోట్లు, నోట్లు–డబ్బు, డబ్బు. డబ్బుకోసం పరుగు—పిల్లల పెళ్ళిళ్ళు వాళ్ళకు కట్నాలు, బరువులు, బాధ్యతలు.—

పిల్లలకు మళ్ళీ పిల్లలు. చావులు, పుట్టుకలు, కొడుకులు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాండ్లు—

అందరూ తనను చూడగానే యికిలిస్తూ నవ్వుతారు—డబ్బు కోసం...అంతా నటన, మోసం, దొంగాటకం.

యీ అరవై యేళ్ళ సుదీర్ఘ జీవితయానం చేసీ చేసీ—అలసి అలసి యిప్పుడు ఆగి వెనక్కి తిరిగి ఆలోచించుకుంటే...అంతా విరక్తి, నిస్పృహ, ఆందోళన, భయం, చివరికి శూన్యం.

"తను ఎందుకు పుట్టినట్టు. ఏం సాధించినట్టు. యిన్నాళ్ళూ జీవించి జీవించి గుండెలో పొంగే సముద్రమంత అశాంతితో ఎటు.... ఎటు తన ప్రయాణం. ఎక్కడ తన గమ్యం. ఎక్కడ తన తృప్తి ఎక్కడ తన జీవిత పరమార్థం—"

అరవై ఏళ్ళ తన జీవితాన్ని తను వృథా చేశాడా. ఎందుకు తనలో శాంతి లేదు. ఎక్కడుంటుంది శాంతి...ప్రశాంతి. తెలుసుకోవాలి...తెలుసుకోవాలి యీ జీవిత మూలాన్ని తెలుసుకోవాలి—

నళినీకాంతం కొండల నడుమ నుంచి పరుగెత్తుతున్న బస్సు కిటికీగుండా ఆకాశాన్ని చూస్తున్నాడు. ఆకాశంలో అప్పటినుంచీ ఓ ఒంటరి పక్షి ఎగురుతూ ఎగురుతూ ఎటో పోతోంది—చుట్టూ మంచు కొండలు, పచ్చగా చెట్లు, చల్లని గాలి, ఎన్నో సెలయేళ్ళు, పర్వతాలను చీల్చుకుంటూ ప్రవహిస్తున్న నిర్మలమైన గంగ—

దారి వెంట ఎందరో ప్రయాణీకులు గుంపులు గుంపులు. ఎన్నో బస్సులు, ఎంతో హడావిడి. బస్సు హృషికేశ్‌ను దాటి బయలుదేరాక— ఎన్నో ఆశ్రమాలు. ఎందరో సాధువులు, అన్నీ కాషాయ వస్త్రాలే. ఆడా, మగా, బీదా, ధనిక—ఎందరో.

అందరూ శాంతిని వెతుక్కుంటూ వచ్చినవాళ్ళు, పాపాలను గంగలో కడిగేసుకుందామనుకుంటున్న వాళ్ళు, యోగులు, ఋషులు, సాధకులు, గురువులు, శిష్యులు—

ఎన్ని రకాల జనమో—కాని యిక్కడ శాంతి ఉందా...ప్చ.... ఏమో. బస్సు ఆగింది.

నళినీకాంతం బస్సు దిగాడు. ఒంటరిగా. కాషాయరంగు ధోతీని సవరించుకున్నాడు. ఒంటిపై నున్న పంచెను నిండా కప్పుకున్నాడు. జానెడు పెరిగిన గడ్డాన్ని వ్రేళ్ళతో దువ్వుకున్నాడు. రివ్వున చలిగాలి దూసుకొచ్చింది బాణంలా.

గజగజలాడి చిగురాకులా ఊగిసలాడి సంచీని తీసుకుని బయలుదేరాడు. చుట్టూ హిమాలయాల సౌందర్యం అమరానుభూతిని కలిగిస్తోంది, ప్రక్కనుంచే గంగ ప్రవహిస్తోంది.

ఎటుచూచినా మంచు, నీరు, యిసుక, పచ్చగా నవ్వే చెట్లు. రంగురంగుల పూలు. అంతా ఆహ్లాదం, ఆనందం, పరవశం.

నడుస్తున్నాడు నళినీకాంతం.

"మోహనాశ్రమం"—అని బోర్డుంది ఓ దగ్గర.

ఆగి...చూశాడు.

ఓ విశాల ప్రాంగణంలో పెద్దఆశ్రమం. ఆశ్రమందాకా సిమెంటు రోడ్డు. రోడ్డు కిరువైపులా ఏపుగా చెట్లు.

నడిచాడు. ఒక్కరొక్కరే సాధువులు, ప్రయాణీకులు ఎదురవు తున్నారు. పోగా పోగా జనం రద్దీ ఎక్కువై తీరా ఆశ్రమం చేరాక ఆశ్రమం ముందు ఎన్నో ఖరీదైనకార్లు, బస్సులు, ఎందరో మనుషులు—

వాతావరణం చటుక్కున మారి అంతా డబ్బు వాసన, మళ్ళీ సుఖ భోగాల కంపు—వస్తూ పోతున్న జనంలో అంతా హడావిడి.

"ఏమిటండీ—" అని అడిగాడో సాధువును.

''స్వామీజీ వచ్చే వేళయింది" గబగబానడుస్తూ పోతున్నాడతను. "స్వామీజీ పేరేమిటి" "నందస్వామి''

"స్వామి వచ్చి ఏంచేస్తాడు" ''భక్తులకు దర్శన మిచ్చి తరింప జేస్తాడు" "ఉ-హూఁ..." కాషాయాంబరధారి వెళ్ళిపోయాడు.

నళినీకాంతం ఆశ్రమం లోపలికి నడిచాడు.

అది పేరుకు ఆశ్రమమే గాని....ఓ పెద్ద జమిందారు భవనంలా వుంది. నేలంతా పాలరాయి. వరండాలో ఫోమ్ సోఫాలు ''ఎన్నో గదులకు ఎర్ కండిషనర్సు...ప్రత్యేకంగా ఓ టెలికమ్యూనికేషన్ గది ఆప రేటర్, ప్రతి పదడుగులకు ఓ ఫోన్."

అంతా అనంత వైభవం. హాలులో అప్పటికే ఎందరో భక్తులు కూర్చుని వున్నారు.

"తప్పుకోండి...తప్పుకోండి...." అవి ఓ పరివ్రాజక బృందం నిశీసికాంతాన్ని తోసుకుంటూ చొచ్చుకొచ్చింది. ఉలిక్కిపడ్డాడు నిశీసికాంతం.

పర్రున ఓ యింపాలా ఏరకండిషన్డుకారు బాణంలా దూసుకొచ్చి ఆశ్రమం ముందాగింది.

డ్రైవర్‌గా పనిచేసిన సాధువు చరచరా దిగి డోర్ తెరిచి పట్టుకున్నాడు. ముందుగా యిద్దరు నవయవ్వనులైన మిసమిసలాడే మునికన్యలు దిగారు. తర్వాత చిద్విలాసంగా నవ్వుతున్న బంగారు రంగుపట్టు బట్టలున్న స్వామీజీ దిగాడు. ఆ తర్వాత మరిద్దరు మునికన్యలు బయటికొచ్చారు.

స్వామీజీ అణువణువులో ఖరీదు తనముంది. అతను సాధువు వేషమేసుకున్నచక్రవర్తిలా అతిఠీవిగా నడుస్తున్నాడు. మునికన్యల ఒంటిపై పరిగ్గా బట్టలులేవు.

మోకాళ్ళదాకా బిగించికట్టిన కాషాయపు వస్త్రం, స్తనద్వయంపై ఓ జానెడు గుడ్డ, నెత్తిలో కనకాంబరాల దండలు, సిటీలోని అందమైన కేబరే డాన్సర్లలా ముట్టుకుంటే మాసిపోయేట్టున్నారు.

దండు మొత్తం హాల్లోకి నడుస్తోంది. దారిలో....స్వామీజీకి పూలు పరుస్తున్నారు బాటనిండా. జనమంతా "ప్రణామ్, ప్రణామ్...."

"శుభ్‌హో...శుభ్‌హో...సత్యం శివం సుందరం—" అతి ఖరీదయిన అగరొత్తుల వాసన గాలినిండా నాట్యంచేస్తోంది.

స్వామీజీ హాలు నడుమనున్న టూగుటుయ్యాలమీద పట్టుపరుపుపై దిండ్లను మోచేతుల కానించుకుని ఆసీనులయ్యారు విలాసంగా. ముని

శిష్యులు సపర్యలు చేస్తూ వింజామర లూపుతున్నారు. యితర శిష్యబృందం నేలపై కూర్చుని భక్తులు తెచ్చిన కానుకల వ్యవహారం చూస్తున్నారు.

నళినీకాంతం మనస్సు గుండుసూది గుచ్చుకున్నట్లుగా వుంది. యితనేమి స్వామీజీ....యీ సుందరీమణుల బహిరంగ సహచర్యమేమిటి...యీ వైభవ విలాసమేమిటి....యీ ప్రాపంచికసుఖాల సాంద్రతర వాతావరణమేమిటి...

అంతా ఓ డబ్బున్న శృంగార పురుషుడు ఓ సాధువు భంగిమలో సుఖాన్నాస్వాదిస్తున్నట్లుగా ఉంది....ఛీఛీ.

ఫారినర్స్ కూడా వున్నారు. అంతా (క్రేజ్—పిచ్చి....వెర్రి) యీ ఆశ్రమాల వ్యవహారమంతా బూటకమా—మోసమా—వ్యాపారమా.

మనసు నీటి బయటపడ్డ చేపలా గిజగిజా తన్నుకుంది. లేచి బయటకొచ్చాడు.

వరండాలో—ఓ స్వామీజీ విగ్రహముంది గాజుకేసులో. ఆ విగ్రహం చుట్టూ పాల వెన్నెలచిందే లైట్ల ఏర్పాటు ఉంది. ...ముఖం రాతిబొమ్మపై దిక్కు ఫోకస్ చేసిన ఓ ఫ్యాన్ వుంది. తిరుగుతూనే వుందది నిర్విరామంగా. ఎందుకీ ఫ్యాన్. రాతి విగ్రహానికి చమట పడుతుందా.

ఎంత వేస్ట్....ఎంత దుబారా—కోట్లమంది బీదజనం ఆకలితో నకనకలాడిపోతున్న యీ దేశంలో....రాతి బొమ్మకు ఫ్యాన్లా.

వీళ్లు యోగులు...ఋషులు...మహర్షులా. చరచరా యివతలకొచ్చాడు.

ఎవడో బాగా డబ్బున్న వాడు ఓ ఏయిర్ కండిషన్డు బస్సులో తన పరివారంతో సహా వచ్చి పూరీలు, కేకు పంచిపెడుతున్నాడు. (ఎంత మహాపాపం చేసాడో) వాని చుట్టూ సాధువులే...సాధువులు బిచ్చగాళ్లకంటే హీనంగా ఎగబడుతున్నారు.

తిండికోసం...డబ్బు కోసం....ఎంత తగవులాట—ఎంత ప్రాకు లాట—

వీళ్ల తనలాంటి వాన్ని మించి ఏం సాధించినట్టు ఏ కోరికలను చంపుకున్నట్లు, ఎంత ఎత్తుగా ఎదిగి మహిమాన్వితులైనట్టు— ఛీఛీ— మనస్సు చీమపట్టిన గాయంలా సలిపింది.

గబగబా గంగానది దిక్కు నడిచాడు స్నానం చేద్దామనిపించంది. చల్లగా ప్రవహించే నీరు, చుట్టూ కొండలు, గంభీరమైన నిశ్శబ్దం. ఒడ్డుపై అక్కడక్కడ వేరే సాధువులు కూడా స్నానాలు చేస్తున్నారు.

బట్టలు విప్పి నదిలోకి దిగాడు. నీళ్లలో మునిగి... ఆ హాయి ననుభవిస్తూ....ఒంటిని తోముకుంటూ, నోటినిండా నీళ్ళను తీసుకొని ఉమ్మేస్తున్నాడు.

''ఓ బాయ్‌సాబ్...కహాకేహై ఆప్'' అని ఎవరో అంటూండగా వినిపించింది తల తిప్పాడు. తనలాగే స్నానంచేస్తున్న ఓ సాధువు.

"ఆంధ్రాకేహై...క్యోం మహరాజ్"

''పవిత్ర గంగా మయ్యాపే థూక్తేహో—"

సాధువు ముఖం ఆగ్రహంగా వుంది. నిజమే...గంగలో తను ఉమ్మేస్తూ.... "క్షమా కీజియే...." సిగ్గుపడ్డాడు నళినీకాంతం. సాధువు సాధారణ విష్ణలో మునిగిపోయాడు.

ఇంతలో ఎవరో ఓ పెద్ద గుంపుగా వస్తున్నట్టు...భజన గీతాలు, చప్పుడూ వినిపించాయి నళినీకాంతం అటువేపు చూశాడు. కొంతమంది ఓ శవాన్ని మోసుకొస్తున్నారు గీతాలు పాడుకుంటూ. వచ్చి వచ్చి... అతను స్నానం చేస్తున్న చోటికి పైన...గంగ ఒడ్డుదగ్గర చేరి... తమ చేతిలోని శవాన్ని గుడ్డలోకట్టి, ఒకడు కాళ్లూ యింకొకడు తలా పట్టు

కుని విసిరి విసిరి.... "రామ్ నామ్ సత్య హై...సారీ దునియా మిథ్యా హై" అని అరుస్తూ గంగలోకి తోసేశారు. శవం నీటిలో మునిగి—

నీరు ప్రవహిస్తూ వస్తూనే ఉంది ఉధృతంగా—ఆ నీటిలో ఆ శవాన్ని స్పృశిస్తూ వస్తున్న నీటిలో...తను స్నానం చేస్తూ ఛీ ఛీ. వళినీకాంతం ఒళ్ళు జలదరించి గగుర్పొడిచింది. గబగబా నీటిలో నుంచి బయటకొచ్చాడు. తను నీటిలో ఉమ్మేస్తే గంగ మలినమైపోతుందట. మరి శవాలను విసిరేస్తే బట్టలు కట్టుకుంటూ యింతకుముందు ప్రశ్నించిన సాధువును అడిగాడు "గంగామే ఐసా శవ్ బహానే సే అపవిత్ర్ నహీ హోతే క్యా—"అని.

"యహ్ హమారా ఆచార్ హై—" ఆచారమా—ఏమి ఆచారం...ఛీ ఛీ. బయలుదేరాడు అక్కడ నుంచి.

ప్రదేశం బాగుంది కాని, మనుషుల ప్రవర్తన చాలా ఛండాలంగా అనిపిస్తోంది చూస్తూంటే. నడుస్తున్నాడు పచ్చని గుబురు చెట్లు ప్రకృతి వేసిన పందిళ్ళలావున్నాయి.

ఒక దగ్గర – ఓ బోర్డ్ వుంది .... "పంద్రహ్ సాల్ సే మౌన్ వ్రత్ మే హై. కృపాయా బాత్ కరావేకీ కోశిశ్ మత్ కీజియే—"

పదిహేనేండ్ల నుంచి మౌన వ్రతమే అబ్బా...యింకాస్త లోపలికి నడిచాడు. ఓ బారెడు గడ్డమున్న మనిషి నిశ్శబ్దంగా ధ్యానం చేసుకుంటున్నాడు. యింకొంచెం దూరం నడిచాడు. యింకో బోర్డు...."దస్ సాల్ సే మౌన్ వ్రత్" ఆ తర్వాత యింకొంత దూరంలో యింకొకటి —"పాంచ్ సాల్".

దేవుడిచ్చిన నోరును దాచుకుని యీ మౌన వ్రతం పాటిస్తూ—వీళ్ళు మహాత్ములను సాధిస్తారా?—ప్చ్—ఏమో.

యింతలో రోడ్డుమీదికి ఏదో సర్రున దొచ్చుకొచ్చినట్టు చప్పుడై, తల అటు తిప్పాడు—ఓ మినీ బస్ వచ్చి ఆగింది.

"సబ్ యహా ఆయియే ..." మైక్‌లోనుంచి వినిపిస్తోంది ఓ గొంతు.

మౌన వ్రతంలో వున్న అనేక మంది స్వాములు గబాగబా లేచి బస్ దగ్గరకు పరిగెత్తారు త్వరత్వరగా.

గుంపు కూడిన అందరికి, బస్‌లోంచి దిగిన ఐరావతంలావున్న సేఠ్ తన పి.ఎ అందిస్తున్న ఒక్కో బ్లాంకెట్‌నూ, ఒక్కో వంద రూపాయల నోటునూ ఒక్కో సాధువుకు పంచిపెడ్తున్నాడు. సాధువులు ఎగబడి అందుకుంటున్నారు.

నళినీకాంతం చూస్తూండగానే—ఒక సాధువు అతి విచారంగా బ్లాంకెట్‌నూ, నోటునూ తీసుకుని విచారంగా తీవ్రంగా సేఠ్ వైపు చూస్తూ నిలబడి పోయాడు స్థాణువై.

"స్వామీజీ! ఆప్ చింతిత్ క్యోం హై" ప్రశ్నించాడు సేఠ్.

స్వామి చటుక్కున వంగి యిసుకలో వ్రేలితో రాయడం మొదలు పెట్టాడు. జో పాంచ్ సాల్‌సే మౌన్ హై వుస్‌కో ఏక్ బ్లాంకెట్ ఔర్ సౌ రూప్యా దియే మై పంద్రహ్ సాల్ సే హుఁ మేరే కోభీ వోహీ దేతే—"

బిగ్గరగా నవ్వాలనిపించింది నళినీకాంతానికి. అంటే—యిక్కడ కూడా సీనియార్టీ—స్వార్థం—అపేక్ష హుఁ—

యిక్కడా పెక్కు వికారాలున్నాయి. యిక్కడా స్వలాభాపేక్ష లున్నాయి భోగ లాలస ఉంది, సుఖ తత్పరత ఉంది. కోరికలున్నాయి. ఐహిక వాంఛలున్నాయి. నీచమైన ప్రవర్తన ఉంది.

యివన్నీ వుంచుకుని మరి యీ గడ్డాలు పెంచుకున్న వాళ్ళు ఏ విషయంగా సామాన్యుని కన్నా ఎదిగినట్టు ఎలా జితేంద్రియులైనట్టు ఎలా వాంఛలను జయించినట్టు. అంతా ఒట్టి బూటకం—నటన—మోసం-

బ్రతికేందుకు యిదో రకం వృత్తా! యిక్కడ శాంతి దొరుకుతుందని వెదుక్కుంటూ రావడం ఎంత బుద్ధి తక్కువ పని చుట్టూ హిమాలయాలు గంగా. ఎంత నిర్మలంగా వున్నాయో — యిక్కడి మనుషుల మనసులు అంతా కల్మషంగా, వికారంగా, ఛండాలంగా వున్నాయి.

నళినీకాంతానికి అప్పటి వరకూ స్వర్గధామంగా అనిపించిన వాతావరణం పరమ రోతగా అనిపించింది.

మనసు నిండా అసహనం అసహనం. అసలు శాంతిని వెదుక్కుంటూ మనిషి ఎటో వెళ్ళడం కాదు — మనిషిని మనసు జయించి అంతర్మథనంలో నుంచి ప్రశాంతిని సాధించాలి.

శాంతి వున్నది ప్రపంచంలో కాదు. ఎవని మనసులో వాడే వెదుక్కుంటే అక్కడే దొరుకుతుంది ప్రశాంతి, పరమార్థం.

నళినీకాంతం వడివడిగా నడుస్తున్నాడు. బోను నుండి బయటపడ్డ జంతువులా.

వెళ్ళిపోవాలి— వెళ్ళిపోవాలి-త్వరగా యీ స్వాముల నుంచి— యీ బాబాల నుంచి యీ వైభవోపేత ఆశ్రమాల నుంచి యీ కుళ్ళు నుంచి.

పరుగెత్తుతున్నట్టుగా నడుస్తున్నాడు. దూరంగా ఢిల్లీవైపు వెళ్ళే బస్సు సిద్ధంగా వుంది స్టార్టయి. అందుకోవాలి దాన్ని. వెళ్ళిపోవాలి అందులో.

పరుగు ... పరుగు .... పరుగు. కొండల్లోంచి మళ్ళీ ప్రపంచం లోకి. మళ్ళీ ఐహిక బంధాల్లోకి—బరువుల్లోకి—బాధ్యతల్లోకి...ఐనా... బాధ్యతా నిర్వహణలో దొరికే అపూర్వ ప్రశాంతిలోకి. పరుగెత్తుతున్నాడు నళినీకాంతం.

బస్సు బయలుదేరింది అందకుండానే. చేయి చాపి — ఊపి అరుస్తున్నాడు ఆందోళనగా. బస్సు వినలేదు. దూసుకు పోతూనే వుంది దుమ్ము రేపుకుంటూ.

నళినీకాంతం కళ్ళనిండా దుమ్ము పడి చటుక్కున కళ్ళు మూసుకున్నాడు, అంతా చీకటి. చీకటి_చీకటి.

మళ్ళీ కళ్ళు తెరిచే సరికి ఎదుట సూర్యుడస్తమిస్తున్నాడు ఎర్రగా...నళినీకాంతం హృదయంలా.

నళినీకాంతం నీడ అతనికి ఎన్నో రెట్లయి పరుచుకుంది నేలపై.